క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు అందజేస్తున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: మండలంలోని పాలవలస రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులను (యూరియా, డీఏపీ) ఎంపీపీ కర్నేన దీప మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులకు జీలుగు, కట్టిజనుము విత్తనాలు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. అగ్రికల్చర్ సిబ్బంది, గ్రామ పెద్ద జల్లు అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

క్రషర్ యజమానులు ధర్నా

పొందూరు: మైనింగ్ నూతన విధానంలో భాగంగా విశ్వ సముద్ర సంస్థ అవలంబిస్తున్న ధోరణికి నిరసనగా క్రషర్ యజమానులు, క్వారీ నిర్వాహకులు, లారీ, ట్రాక్టర్ల యజమానులు ఆందోళనకు దిగారు. నరసాపురం రోడ్డుపై మంగళవారం ధర్నా చేశారు. పొందూరు ఏఎస్సై రామచంద్రరావు సిబ్బందితో చేరుకుని ఇరువర్గాలతో చర్చించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించడంతో ట్రాఫిక్ అంతరాయానికి తెరపడింది. ధర్నాలో క్రషర్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు



విత్తనాల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్

బూర్జ: మండలంలోని కురింపేట గ్రామంలో విత్తనాలు షాపుల్లో వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ 2023 సంవత్సరానికి సంబంధించి షాపుల ద్వారా రైతులకు విక్రయించేందుకు తెచ్చిన విత్తనాలను ఏఓ వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. వరి విత్తనాల రకం, మొలక శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాల కోసం సాంపిల్స్‌ని సేకరించారు. వర్తకులకు సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పోలరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి



మాట్లాడుతున్న సనపల నరసింహులు

నరసన్నపేట: పెరుగుతున్న నిరుద్యోగాన్ని పట్టించుకోకుండా కేంద్రం ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు యువత సమాయత్తం కావాలని సీపీఐ సీనియర్ నాయకులు సనపల నరసింహులు, చాపర సుందర్‌లాల్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్క్ షాపు నిర్వహించారు. దేశంలో నిరుద్యోగం రేటు తీవ్ర స్థాయిలో ఉందని, కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగ యువత తమ హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. పబ్లిక్ సెక్టార్లను ప్రైవేటీకరణ చేస్తూ నిర్వీర్యం చేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామమూర్తి, సహాయ కార్యదర్శి వెంకటరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకర్లవాని చెరువుపై కలెక్టర్‌కు నివేదిక



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతి, అధికారులు

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం పంచాయతీ పరిధి సర్వే నంబర్ 48, 59లలో ఉన్న కాకర్లవాని చెరువుపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఆర్డీఓ బి.శాంతి తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు మంగళవారం కాకర్లవాని చెరువును పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్లు, ఇతర కట్టడాలతోపాటు ఆక్రమణలలో ఉన్న వాటిని తొలగించేందుకు గల అవకాశాలను జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ, సర్వే శాఖల అధికారులతో కలిసి పరిశీలన చేసి పూర్తిస్థాయి నివేదిక అందించనున్నామన్నారు. ఈ చెరువును పూర్వ స్థితికి చేర్చేందుకు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలన చేయనున్నామన్నారు. ఇరిగేషన్‌శాఖ ఎస్‌ఈ పొన్నాడ సుధాకర్, డీపీఓ పి.రవికుమార్, తహసీల్దార్ బి.సత్యం, సర్వేయర్ నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఏఈ వారాణాసి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



పొందూరు: ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తుంగపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, పార్టీ నాయకులు బాడాన కృష్ణ, బొడ్డేపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు అండగా నిలిచిన సీఎం జగన్

పోలాకి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా నిలిచిన నాయకుడుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కోడూరు గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు సాలిన నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన పథకాలను, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుంటూ.. అక్కడికక్కడే అధికారుల దృష్టిలో పెట్టి పరిష్కరించారు. గ్రామంలో గత ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2014లో కోడూరు ఎంపీటీసీ పరిధిలో క్లిష్టపరిస్థితుల్లో అండగా ఉండి, ఆ తరువాత అప్పటి ప్రభుత్వ వేధింపులకు ఎదురొడ్డినిలబడిన కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేస్తామన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పైల మల్లేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును, ఆయా పథకాల ద్వారా కుటుంబ సభ్యులు పొందిన ఆర్థిక ప్రయోజనాన్ని వివరించారు. జగనన్న పథకాలే మా కుటుంబానికి ఆర్థికంగా ఆదుకున్నాయని.. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాలని కోరకుంటున్నామని తాళాభక్తుల రామబ్రహ్మం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత మేరకు రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, మహిళా సంఘాల రుణ మాఫీ, చేయూత, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా పింఛన్ కానుక.. ఇలా అనేక పథకాలు అందజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లోను సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, లక్ష్మీనర్సుపేట సర్పంచ్ ముగడ దివాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, పార్టీ నాయకులు ముగడ జనార్దన, ఆశోక్ పాణిగ్రాహి, లుకలాపు సుధీర్, లోచర్ల మల్లేశ్వరావు, కొల్ల రాము, తొత్తడి మురళీకృష్ణ, రెడ్డి సీతారాం, కొల్ల లక్ష్మనాయుడు, బలగ గోవిందరావు, రెడ్డి లక్ష్మణరావు, తలసముద్రం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోలాకి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఎల్.ఎన్.పేట: సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఇంటింటికీ తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తుంగపేట గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు రూ.39 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పార్టీ నాయకుడు బొడ్డేపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఔదార్యం..

కొత్తూరు: మండలానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఆసర సురేష్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతోపాటు, ముగ్గురు ఆడపిల్లలతో కుటుంబాన్ని పోషిస్తున్న మృతుడి భార్య సుజాతకు ట్రస్టు సభ్యులు మంగళవారం రూ.30 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కొత్తూరుకు చెందిన బొమ్మాళి బాబూరావు కాలుకు గాయమైంది. ఇన్ఫెక్షన్ కావడంతో కాలుకు ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. పండ్ల వ్యాపారం చేసుకుంటున్న కుటుంబం కావడంతో ట్రస్టు సభ్యులు రూ.10 వేల నగదును అందజేశారు. ట్రస్టుకు పలువురు దాతలు అందజేసిన మొత్తంతో ఈ ఆర్థిక సాయం చేస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

రీ సర్వే సజావుగా నిర్వహించాలి

నరసన్నపేట: మండలంలో భూముల రీ సర్వే సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. మంగళవారం సత్యవరంలో శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల సేకరణను సర్వే సిబ్బంది నిర్వహించారు. సర్వే సిబ్బంది, దూకులపాడు సర్పంచ్ అల్లు అసిరినాయుడు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయాలి

పాతపట్నం: జీవాల్లో మరణాల శాతం తగ్గించుకోవడానికి, శరీర బరువు పెరగడానికి కచ్చితంగా నట్టల నిరవారణ మందులు గొర్రెల, మేకల పెంపకందారులు వాడుకోవాలని పాతపట్నం పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో సామూహిక గొర్రెల, మేకలకు నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 20,193 గొర్రెలు, 23,893 మేకలు ఉన్నాయన్నారు. ఈ నెల 15వ తేదీలోగా నట్టల నివారణ మందులు ఆర్‌బీకేల ద్వారా వేయించుకోవాలన్నారు. వైఎస్సార్ పశుబీమా సంవత్సరం, రెండు, మూడేళ్లకు వేర్వేరు ప్రీమియంలు ఉంటాయన్నారు. పశువైద్య సహాయకుడు నిరంజన్, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

కొత్తూరు: మండలంలోని కురిగాం పీహెచ్‌సీలో క్షయవ్యాధితో బాధపడుతున్న బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ట్రస్టులు, స్వచ్ఛంద సంస్థలు అందజేసిన కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటి కోఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కింద కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కిట్లను ఆరు నెలలపాటు పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు నెలలు పూర్తయిందన్నారు. కురిగాం పీహెచ్‌సీ ఈఓ బుజ్జిబాబు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు చిన్మయరావు, నరసింహరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎల్.ఎన్.పేట: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని వైకేపీ ఏపీఎం ఎస్ రవిరాజ్ అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆసరా పింఛన్ కోసం అర్హత కలిగిన మహిళలు రెన్యువల్ చేసుకోవాలన్నారు. సీసీ పుణ్యవతి, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

నూతన కళాశాలలో తరగతుల ప్రారంభం

సరుబుజ్జిలి: రొట్టవలస జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది కొత్తగా మంజూరైన బాలికల జూనియర్ కళాశాల తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు హెచ్‌ఎం ఎన్.రామకృష్ణ తెలిపారు. స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో నియోజకవర్గంలో బాలికల జూనియర్ కళాశాల కొత్తగా మంజూరు చేయడం జరిగిందన్నారు. కళాశాలలో పూర్తిస్థాయి అధ్యాపకులను నియామకం జరిగినట్లు వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణపొందిన విద్యార్థులు ప్రవేశంపొందాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస రూరల్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజేశ్వరి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిలే నిరాహార దీక్షను మంగళవారం నిర్వహించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, ఎరియర్స్‌ను ఇప్పించి, 12వ వేతన సవరణ చేయాలని కోరారు. ఆమదాలవలస తాలూకా యూనిట్ అధ్యక్షుడు డి.సురేష్, కార్యదర్శి బగాది నాగరాజు, ట్రెజర్ సీపాన హరీష్, గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయానికి వచ్చే భక్తులకు పాతపట్నంలోని రత్నాలపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్.రాజారావు, సుజాత దంపతులు మంగళవారం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుదీర్ఘ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర అందజేశారు. ఆర్.వెంకటరమణ, ఎన్.లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

ఆమదాలవలస రూరల్: మండలంలోని తొగరాం గ్రామ పంచాయతీ పరిధి ఇసుకలపేట గ్రామం వద్ద నాగావళి నదిపై నిర్మించనున్న బలసలరేవు బ్రిడ్జి పనులను బుధవారం ఉదయం 8 గంటలకు స్పీకర్ తమ్మినేని సీతారాం పరిశీలించనున్నారు. ఈ మేరకు మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మతొర్లాడ గ్రామంలో మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొంటారని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

నేడు బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాలు

ఆమదాలవలస రూరల్: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను మండలంలో అక్కులపేట గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరవ్వాలని కోరారు.

పల్లెబాట విజయవంతం చేయండి

సరుబుజ్జిలి: మండలంలోని కొండవలస గ్రామంలో పల్లెబాట కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి, సమస్యలను నేరుగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

నరసన్నపేట: లాభ సాటిగా ఉన్న ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.రవీంద్రభారతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అనేక రాయితీలు ఇస్తోందని, ఉపాధితో అనుసంధానం చేసిందన్నారు. దీనిపై స్థానిక ఆర్‌బీకేలో నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఉన్న వీఏఏలతో మంగళవారం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు చేసే యాళ్ల మోహన్‌రావును ఈ సందర్భంగా సత్కరించారు. నరసన్నపేట, పోలాకి ఏఓలు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన

నరసన్నపేట: స్కిల్ హబ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ ఒకటి నుంచి జీ-20 జన్‌భగీదరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇది జూన్ 15 వరకు కొనసాగుతోందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా నరసన్నపేట స్కిల్ హబ్స్‌లో శిక్షణ పొందుతున్న యువతకు వివిధ రకాల నైపుణ్యాభివృద్ధి, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోవర్దన్ ఆధ్వర్యంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ సూచనలతో 'జన్‌భగీదరి' నిర్వహిస్తున్నారు. మంగళవారం వివిధ అంశాలపై డిబేట్, రాత పరీక్ష నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- హౌసింగ్ డీఈఈ నర్సింగరావు



మాట్లాడుతున్న డీఈఈ నర్సింగరావు

పాతపట్నం: మండలంలోని జగనన్న లేవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని హౌసింగ్ డీఈఈ వి.నర్సింగరావు సచివాలయ ఇంజినీర్లకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇళ్లు కట్టవారికి నోటీసులు అందించాలని, నోటీసులు ఇచ్చినప్పటికీ కట్టకపోతే వారి కాలనీ రద్దు చేస్తామన్నారు. అనుకున్న సమయంలో ఇళ్లు కట్టకపోతే కాలనీ బిల్లు రాదని తెలియజేయాలన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పిస్తుందన్నారు. సీసీ రహదారులు, విద్యుత్, ఇంటింటికీ కుళాయిలు, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కొలతల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ భాస్కరరావు, హౌసింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో నిర్వహిస్తున్న రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని అధికారులను స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమంలో అలసత్వం వహిస్తే క్షమించేది లేదన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తిచేయాలన్నారు. సమావేశానికి కొందరు హెచ్‌ఎంలు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫేజ్ -1, ఫేజ్ -2 పనులు ఎంతవరకు పూర్తయ్యాయని మండలాల వారిగా ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు సర్వశిక్షా అభియాన్ ఏపీసీ రోణంకి జయప్రకాష్, డీఈఓ తిరుమల చైతన్య, నాలుగు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నరసన్నపేట: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రజలందరూ సహకరించాలని, అందరూ కలిసిమెలిసి ఉండాలని టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని సుందరాపురంలో మంగళవారం సాయంత్రం పోలీస్ చట్టాలపై అవగాహన సమావేశాన్ని నరసన్నపేట పోలీసులు నిర్వహించారు. దీంట్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో సామరస్యంగా ఉండాలని, కులాలు, మతాల పేరున వివాదాలకు పాల్పడవద్దని సూచించారు. తప్పుడు ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసన్నపేట సీఐ డీ.రాము, ఎస్ఐ సింహాచలం మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రతా చర్యలు పాటించాలన్నారు. అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ పెద్ద సడగాన రవి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో పెద్దమోసం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో మోసపూరితమైనదని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్న విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. ప్రధానంగా మహిళా సంఘాల రుణాలు, పంట రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక రాష్ట్రం అప్పుల్లో కూరుకపోతుందని బాధ్యతారాహిత్యంగా విమర్శించారన్నారు. సీఎం జగన్ ఇస్తున్న పథకాలను చంద్రబాబు కాపీ కొట్టారన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొయిలాపు సంజీవరావు, అగతమూడి రంజిత్, నాగేశ్వరరావు, తిరుపతిరావు, లోతుగెడ్డ ఇందిరరామ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



విచారణ చేస్తున్న డీఎస్‌ఓ

సారవకోట: మండలంలోని మదనాపురం రేషన్ డీలర్ (మణికంఠ స్వయం శక్తి సంఘం) గొద్దు రాములమ్మపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీఎస్‌ఓ డీవీ రమణ తెలిపారు. రేషన్ డిపోలో అక్రమాలకు పాల్పడుతున్నారని సర్పంచ్ పొన్నాన స్వాతి తోపాటు గ్రామస్తులు పలువురు జిల్లా సివిల్ సప్లయ్ అధికారికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం ఆయన గ్రామానికి వెళ్లి రేషన్ డిపోను పరిశీలించారు. దీంట్లో 3 క్వింటాళ్ల బియ్యం, 32 కేజీల చక్కెర తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రేషన్ డీలర్‌పై 6-ఎ కేసు నమోదు చేసి, ఆ రేషన్ డిపోను రామకృష్ణాపురం డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు. సీఎస్ డీటీ గణేష్, ఆర్ఐ బేగం, వీఆర్వో అప్పారావు ఉన్నారు.

మండల సర్వేయర్‌గా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న సచివాలయ సర్వేయర్ల సంఘం సభ్యులు

సారవకోట: మండల సర్వేయర్‌గా రావాడ రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మండల సర్వేయర్ ఉద్యోగోన్నతిపై గత కొన్ని నెలల క్రితం రేగిడి ఆమదాలవలస వెళ్లగా.. ఇక్కడ సర్వేయర్ పోస్టు ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా రామకృష్ణను సర్వే శాఖ ఏడీ కార్యాలయం నుంచి సారవకోట మండల సర్వేయర్‌గా నియమితులయ్యారు. ఈయనకు సచివాలయ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. సంఘం సభ్యులు లోకేష్, పాపారావు, రాంబాబు, విజయ్ తదితరులున్నారు. డిప్యూటీ తహసీల్దార్‌గా మధుబాబు విధుల్లో చేరారు.